క్లుప్తంగా

ఘనంగా లడ్డూ వేలం పాటలు



వాకలగరువుతో అమ్మవారి లడ్డూతో భక్తులు

అంబాజీపేట: దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని అంబాజీపేట మండలంలో పలు దుర్గమ్మ ఆలయాల వద్ద సోమవారం అన్నసమారాధనలు, లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. వాలకగరువు రావిచెట్టు సెంటర్ వద్ద కొలువుదీరిన విజయదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అంతకుముందు స్థానిక భక్తులు అమ్మవారికి వెండి కనురెప్పలను కాండ్రేగుల వెంకటేష్, వెండి కిరీటాన్ని కుడుపూడి నాగేశ్వర రావులు సమర్పించారు. అంతకుముందు అమ్మవారి లడ్డూను కాండ్రేగుల నాగేశ్వరరావు రూ.18 వేలకు దక్కించుకున్నారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి వార్ల ఆలయ వద్ద నెలకొల్పిన దుర్గమ్మను గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీనివాసనగర్‌లో వేంచేసిన విజయబేతాళ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపులు



అంబాజీపేటలో వాసవీ మాత ఊరేగింపులో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి ఊరేగింపులను సోమవారం అంబాజీపేటలో ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి వాహనంపై ఊరేగించారు. అలాగే పశువుల మార్కెట్ వద్ద ఉన్న విజయ కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపును కన్నులపండువగా జరిపారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలతోను, వివిధ అమ్మవార్ల వేషధారణలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆలమూరు: సబ్‌స్టేషన్‌లో తరచూ విద్యుత్ అంతరాయాలు సంభవిస్తున్నాయని, వాటి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ రాజబాబు, డీఈ కె.రత్నాలరావు, ఏడీఈ సీహెచ్ శ్రీధర్ అన్నారు. మండలంలోని చొప్పెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్లో జరుగుతున్న పనులను వారు సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే దాని స్థితిగతులపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ వివిధ సబ్ స్టేషన్లలో విద్యుత్తు అంతరాయాలపై పలు ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని అధిగమించేందుకు సిబ్బందితో తక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్‌పై వచ్చే అంతరాయాల నిర్మూలనకు మండలంలో వివిధ గ్రామాలకు సంబంధించిన విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయవలసి వచ్చిందని వారు తెలిపారు. ఈ మేరకు సోమవారం పగటిపూట పూర్తిగా నిలుపుదల చేసి పనులు పూర్తి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, ఎల్‌ఐలు వి.సత్యనారాయణ, కేవీ సుబ్రహ్మణ్యం నాయుడు, లైన్‌మన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

సఖినేటిపల్లి: క్షయ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ దుర్గా కావ్య సూచించారు. సోమవారం సఖినేటిపల్లిలంక పంచాయతీలో సర్పంచ్ రేపూరి రాజేశ్వరి అధ్యక్షతన క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ కావ్య మాట్లాడుతూ, రెండు వారాలకు పైబడి దగ్గు, కళ్లె పడడం, రాత్రి వేళల్లో జ్వరం రావడం, చాతీలో నొప్పి రావడం వంటి లక్షణాలు ఉన్నవారు పీహెచ్‌సీలో కచ్చితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధికి డాట్ పద్ధతిలోనే ఇంటి వద్ద రోగులకు సిబ్బంది ఉచితంగా చికిత్స అందజేస్తారన్నారు. రేపూరి ఏసు నరసింహ రాజా, ఆర్.వెంకట రమణ, గునిశెట్టి రాజీ, పడాల పెదకాపు, రాజోలు టీబీ యూనిట్ అధికారులు, పీహెచ్‌సీ వివిధ గ్రేడ్లలోని సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్వేదిలో హైదరాబాద్‌లోని దేవీ విగ్రహం నిమజ్జనం

సఖినేటిపల్లి: హైదరాబాద్ ఈసీఐఎల్ ఏరియాకు చెందిన దేవీ విగ్రహాన్ని సోమవారం అంతర్వేది వద్ద సాగరసంగంలో నిమజ్జనం చేశారు. ఈసీఐఎల్ ఏరియాలో భక్తులు దసరాకు తాత్కాలికంగా అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చారు. ఉత్సవాల అనంతరం అమ్మవారి విగ్రహాన్ని హైదరాబాదు నుంచి అంతర్వేదికి వాహనంలో తీసుకువచ్చారు. ఏటా ఒక్కో పుణ్య క్షేత్రంలో విగ్రహాన్ని నిమజ్జనం చేసే క్రమంలో ఈ దఫా అంతర్వేదిలో నిమజ్జనం చేసినట్టు సదరు భక్తుడు విజయ్‌కుమార్ తెలిపాడు.

ప్లాస్టిక్ భూతం.. పర్యావరణం హతం

- రోజురోజుకూ పెరిగిపోతున్న ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డులుగా మారుతున్న రహదారులు
- నిప్పుపెడితే పర్యావరణానికి మరింత ముప్పు



216 ఏ జాతీయ రహదారి చెంత వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



పంట కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆలమూరు: ప్లాస్టిక్ భూతం పర్యావరణాన్ని, వాతావరణ సమతుల్యతను దెబ్బతీస్తుంది. భవిష్యత్తు తరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్లాస్టిక్ నిషేధం కేవలం ప్రచారానికే పరిమితమవుతోంది. ప్రభుత్వాలు ప్లాస్టిక్ నియంత్రణకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ప్రతి ఒక్కరూ స్వయంగా నష్ట నివారణ చర్యలు తీసుకోకపోతే భావితరాలకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదముంది. నిర్ణీత మైక్రాన్ల కంటే తక్కువగా ఉండే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడానికి వీల్లేదంటూ చట్టాలను చేసినప్పటికీ కూడా వాటిని అమలు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా అప్పుడప్పుడు తనిఖీలు చేసి చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది. దీంతో ప్రజలు అనునిత్యం ఉపయోగించే ప్లాస్టిక్ వ్యర్థాలు రహదారుల చెంతకు, పంట కాలువల్లోకి చేరి డంపింగ్ యార్డుల్లోకి మారుతున్నాయి. అక్కడ మళ్లీ ఆ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో వాతావరణం మరింత కలుషితమై అంటువ్యాధులకు కారణమవుతుంది. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టే ఆయుధం ప్రజల చేతుల్లో ఉన్నా మిన్నకుండిపోవడం, మనకెందుకులే అని అభిప్రాయం పడటం సమస్యను మరింత జటిలం చేస్తుంది.

అక్కరకు రాని సంపద తయారీ కేంద్రాలు

ఆవాస ప్రాంతాల నుంచి సేకరణ జరిగే చెత్త నుంచి సంపద తయారీ చేయాలనుకున్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని గుర్తించిన ప్రభుత్వాలు నష్ట నివారణ చర్యల కోసం గతంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రవేశపెట్టింది. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి పర్యావరణ హితంగా ఉపయోగించుకునేందుకు చేపట్టిన చర్యలు ఏ మాత్రం ఆశించిన స్థాయిలో ఉపయోగపడలేదు. కొన్నాళ్ల పాటు పారిశుధ్య కార్మికులు ఇళ్ల వద్దకు వెళ్లి తడి, పొడి చెత్తగా విభజించి వేరువేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించేవారు. వాటిని ఎరువులను తయారు చేయాలని సంకల్పించిన ప్రయోజనం చేకూరలేదు. దీంతో వ్యర్థాల సేకరణలో భాగంగా తొలుత ప్లాస్టిక్ వస్తువులనే వేరు చేసి రీసైక్లింగ్ చేసే విధంగా తీసుకోవాలనుకుంటున్న చర్యలు క్షేత్ర స్థాయిలో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనునిత్యం టన్నుల కొద్దీ పోగవుతున్న చెత్తను సక్రమంగా రీసైక్లింగ్ చేయడంలో గ్రామీణ ప్రాంతాల్లో సరైన వ్యవస్థ లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో రహదారులు, పంట కాలువలు, కాలువగట్లు డంపింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. కాలనుగుణంగా ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ ఒక్కచోటకు చేరుకోవడంతో దుర్వాసన వెదజల్లి అంటువ్యాధులకు కారణమవుతుంది. గ్రామ పంచాయతీల పరిధిలో డంపింగ్ యార్డులు లేక గ్రామ పంచాయతీల సిబ్బంది సమీప నివాస ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను ఎక్కడికక్కడే నిప్పు పెడుతున్నారు. దీనివల్ల అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ తదితర వస్తువులు సైతం కాలిపోయి గాలి కాలుష్యం పెరిగిపోతుండగా తాగునీరు కలుషితమవుతుంది. అలాగే ధవళేశ్వరం బ్యారేజీ నుంచి తూర్పు, మధ్య డెల్టా కాలువల గుండా ప్రవహించే సాగునీటికి ప్లాస్టిక్ వ్యర్థాలు తీవ్ర అడ్డంకిగా మారాయి. ఎక్కడికక్కడ పంట కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడటంతో శివారు ప్రాంత భూములకు సక్రమంగా సాగునీరు అందడం లేదు.

పంటభూములు కలుషితం

పంట కాలువల్లోంచి సాగు నీటిని నేరుగా పొలాలకు పారిస్తే వాటితో పాటు ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా పొలాల్లోకి చేరుతున్నాయని రైతులు వాపోతున్నారు. పంట కాలువల్లోకి ప్రతి రోజు టన్నుల కొద్ది ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయని అంచనాగా ఉంది. శుభకార్యాల్లో వినియోగించిన వ్యర్థాలను సైతం రహదారులు చెంతనే పారబోయడం వంటి విపరీత పరిస్థితులు నెలకొనడంపై ఆందోళన వ్యక్తమవుతుంది. ప్లాస్టిక్ వ్యర్థాల్లో అధికంగా వాటర్ ప్యాకెట్లు, వాటర్, కూల్‌డ్రింక్ బాటిళ్లు, డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు, క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ తాళ్లు, చెప్పులు ఉంటున్నాయనితెలుస్తోంది. ప్రజా జీవితం పది కాలాల పాటు బాగుండాలంటే ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని వాటికి దూరంగా ఉండడమే దీనికి సరైన పరిష్కార మార్గమని వారు సూచిస్తున్నారు.

నేడు శాలివాహన సంఘ సమావేశం

అంబాజీపేట: కోనసీమ జిల్లా శాలివాహన సంక్షేమ సంఘ సమావేశం మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు మాచవరం సంఘ భవనం నందు నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు తెలిపారు. సమావేశంలో మండలాల వారీగా కమిటీలు వేయడం సంఘ రిజిస్ట్రేషన్ కార్తిక వన సమారాధన నిర్వహణ, తదితర అంశాలపై చర్చించుకున్నట్లు వారు తెలిపారు. సమావేశానికి జిల్లాలోని ఆయా మండలాల శాలివాహన సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

రోగికి ఆర్థిక సాయం



కేశవదాసుపాలెంలో బాధితురాలికి సాయం చేస్తున్న ఎంపీటీసీ దీవెనకుమారి

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న గుమ్మిడి పద్మకు సఖినేటిపల్లి రత్నాలపేటకు చెందిన దాత గొల్ల విజయ ప్రకాష్ రూ.10 వేలు సోమవారం చేకూర్చారు. ఈ మేరకు పై మొత్తాన్ని సఖినేటిపల్లి ఎంపీటీసీ రాపాక దీవెన కుమారి, ఆమెకు అందజేశారు. వెంట రాపాక సూర్యప్రకాష్, తాడి సహదేవ్, యెనుముల చిట్టిబాబు, సీహెచ్ మత్తయ్యకుమార్, కొల్లాబత్తుల చిట్టిబాబు, కె.సోమరాజు, వై.సింహాచలం పాల్గొన్నారు.

మోరిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మోరి జెడ్పీ ఉన్నత పాఠశాల సమ్మేళనంలో ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

సఖినేటిపల్లి: మోరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం వైభవంగా జరిగింది. పాఠశాలలో 1986-1991 మధ్య విద్యాభ్యాసం చేసిన విద్యార్థులంతా 32 ఏళ్ల తరువాత ఈ రోజు కలిశారు. తమ చిన్ననాటి అనుభూతులను జ్ఞాపకాలను ఆనందంగా పంచుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న వారంతా ఒక చోట చేరుకుని తాము చదువుకున్న పాఠశాలను చూసి మురిసిపోయారు. ఆహ్లాదంగా గడిపారు. తమ ఉపాధ్యాయులు అయిన తెలుగు పండిట్ మైలవరపు వెంకట లక్ష్మీ నరసింహారావు, మేడిది మూలాస్వామి నాయుడు, సీనియర్ అసిస్టెంట్ గెడ్డం పేర్రాజులను ఆహ్వానించి వేదికపై వారికి సన్మానం చేశారు. సభలో తెలుగు పండిట్ మాట్లాడుతూ ఆనాటి విద్యార్థులను ఇలా కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలా కలసి మెలసి ఉండడం ప్రతి విద్యార్థి అలవరచుకోవాలని సూచించారు. చిన్న నాటి స్నేహం చాలా అపురూపమని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం

సఖినేటిపల్లి: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్యాన్ని పూర్తి అందుబాటులోకి తెచ్చేందుకు తగిన కృషి చేస్తున్నట్టు అమలాపురం కిమ్స్ ఆసుపత్రి అధినేత చైతన్యరాజు అన్నారు. సోమవారం సఖినేటిపల్లి పాలెంలో కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడ్ యునైటెడ్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలన రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ గావించారు. చైతన్యరాజు మాట్లాడుతూ, ఎమెర్జెన్సీ ఆరోగ్య సేవలుకు ఈ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్లినిక్ సందర్శించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు, కిమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. తాటిపాక, మలికిపురం, సఖినేటిపల్లిల్లో వైద్య సౌకర్యాల కల్పనకు యాజమాన్యం చొరవ చూపడం సంతోషకరమని ఆయన తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జి.పెదకాపు, ఎంపీపీ వీరా మల్లిబాబు, డాక్టర్ ఆర్.పద్మరాజు, సర్పంచ్‌లు గొల్లమందల చిట్టిబాబు, కట్టా ఉమా మహేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కరస్పాండెంట్ చాంబర్ ముట్టడి



మలికిపురంలో కరస్పాండెంట్ చాంబర్‌ను ముట్టడించిన అధ్యాపకులు

మలికిపురం: జీతాల కోసం గత 34 రోజులుగా ఆందోళన చేస్తున్న మలికిపురం డిగ్రీ కళాశాల అధ్యాపకులు సోమవారం కళాశాల కరస్పాండెంట్ చాంబర్‌ను ముట్టడించారు. కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి ఎదుట నేలపై కూర్చొని నిరసన తెలిపారు. జీతాలు వెంటనే చెల్లించాలని కోరారు. జీతాలు ఇప్పట్లో ఇవ్వలేమని, కళాశాల ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని కరస్పాండెంట్ స్పష్టం చేశారు. కరస్పాండెంట్ మొండి వైఖరి విడనాడాలని అధ్యాపకులు నినాదాలు చేశారు. అధ్యాపకులకు ఎమ్మెల్సీ అభ్యర్థి సత్తిరాజు స్వామి తదితరులు సంఘీభావం తెలిపారు.

గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు



పల్లిపాలెంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: మండలంలో పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో సోమవారం పల్లెపండుగను అధికారులు నిర్వహించారు. ఇందులో ఎన్ఆర్‌జీఎస్ పథకం, 15వ ఆర్థిక సంఘం గ్రాంటు నుంచి మంజూరైన రోడ్డు పనులకు పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, కేశవదాసుపాలెం, గొంది, గుడిమూల గ్రామాల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శంకుస్థాపనలు నిర్వహించారు. తొలుత అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు వనమాలి మూలాస్వామి, గుబ్బల ఫణి, గెడ్డం మహలక్ష్మి ప్రసాద్, ముప్పర్తి నాని పాల్గొన్నారు.

నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

అంబాజీపేట: ఈ నెల 15వ తేదీ నుంచి మండలంలో పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. 15న వాకలగరువు, తొండవరం, నందంపూడి, మాచవరం, కె.పెదపూడి, చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లోను నిర్వహించనున్నామన్నారు. 19న పసుపల్లి, వక్కలంక, ముక్కామల, ఇరుసుమండ, పుల్లేటికుర్రు, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ హాజరవుతారన్నారు.

లంక భూములపై ఉన్న సెక్షన్‌ను తొలగించండి



కొత్తపేటలో ఆర్డీవో శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

కొత్తపేట: మండలంలోని కొత్తపేట, మందపల్లి, కేదార్లంక గ్రామాల పరిధి లంక భూములపై ఉన్న 22/ఎ సెక్షన్ తొలగించాలని కోరుతూ ఆయా ప్రాంతాల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రైతు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్, గుబ్బల మూర్తి ఆధ్వర్యంలో లంక భూముల రైతులు ఆర్డీవో పి.శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. సెక్షన్ 22/ఎ వల్ల ఎన్నో సంవత్సరాలుగా తమ స్వాధీనంలో ఉన్న జిరాయితీ భూములకు రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరగడం లేదని వాపోయారు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు అందడం లేదని, రైతులకు ఎటువంటి లబ్ధి చేకూరడం లేదని ఆర్డీవోకు మొరపెట్టుకున్నారు. ఈ భూములన్నీ చిన్నకారు రైతులకు చెందినవని వివరించారు. వెంటనే సెక్షన్ 22/ఏ తొలగించి రైతులను ఆదుకోవాలని కంఠంశెట్టి శ్రీనివాస్ గుబ్బల మూర్తి ఆర్‌డీఓ శ్రీకర్‌ను కోరారు. ఇంకా వివిధ సమస్యలపై మరో ఐదు అర్జీలు వచ్చినట్టు ఆర్డీవో కార్యాలయం సిబ్బంది తెలిపారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి



కొత్తపేటలో నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

కొత్తపేట: ఎలక్షన్ కోడ్ కారణంగా నిలిచిపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్స్ రెగ్యులైజేషన్‌ని వెంటనే చేయాలని ప్రభుత్వాన్ని కాంట్రాక్ట్ లెక్చరర్లు డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వారు సోమవారం వినూత్న రీతిలో పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. సంఘ నాయకులు మాట్లాడుతూ తాము ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2000 నుంచి సుమారు 24 ఏళ్లుగా కాంట్రాక్ట్ విధానంలో అధ్యాపకులుగా పనిచేస్తున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం నుంచి ఈ నెల 19 వరకు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి చిక్కాల నరసింహం, కాంట్రాక్ట్ లెక్చరర్స్ గంధం సత్యనారాయణ, కె.గంగాధర్, తనికెళ్ల శాస్త్రి, చిరంజీవి, ఉమావీరలక్ష్మి, మాధురి, సూర్యనారాయణ, వరప్రసాద్, హనూకు, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు డీజే బాక్సులకే అనుమతి



అంబాజీపేటలో డీజే నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ గోవిందరావు

అంబాజీపేట: ఉత్సవాలు, జాతరలకు వినియోగించే సౌండ్ సిస్టమ్ డీజే బాక్సులు నాలుగు వరకే అనుమతి అని కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు చెప్పారు. అంబాజీపేట ఏవీఆర్ అండ్ వైఎస్సార్ కల్యాణ మండపంలో విజయ బేతాళ ఉత్సవ కమిటీ, 13 పాలాల వాహన నిర్వాహకులతో, డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులతో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ గోవిందరావు విలేకరులతో మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో భాగంగా అమలాపురంలో జరిగిన సంఘటనలను పురస్కరించుకుని జిల్లా ఎస్పీ వి.కృష్ణారావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఒక్కో వాహనానికి నాలుగు డీజే సౌండ్ బాక్సులు మాత్రమే ఉండాలని, అశ్లీల నృత్యాలు నిర్వహించరాదన్నారు. డీజే నిర్వాహకుడైన (జాకీ)లు 18 ఏళ్లు పైబడి ఉండాలని, సౌండ్ ఇంజినీర్ డిప్లొమా కలిగి ఉండాలన్నారు. ప్రతి వాహనం దగ్గర డీజే బాక్సులను నియంత్రించేందుకు కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. జేసీబీల ద్వారా హై లైటింగ్ ఏర్పాటు చేయరాదన్నారు. డీజే బాక్సులకు సంబంధించి ఏమైనా నాలుగు మాత్రమే ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీజేల నిర్వాహకులు వారి వద్ద ఉన్న బాక్సుల వివరాల కోసం తప్పనిసరిగా రిజిస్టర్ మెయింటెయిన్ చేయాలన్నారు. సౌండ్ సిస్టమ్ అధికంగా వస్తుందని ఫిర్యాదులు వచ్చినా, ప్రభుత్వ ఆదేశాలు, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవన్నారు. ఎస్సై కె.చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎస్సైలు చైతన్యకుమార్, శివకృష్ణ, అభ్యుదయ శెట్టిబలిజ సంక్షేమ సంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జునమోహనరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బొంతు పెదబాబు, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి సత్యమోహన్, మట్టపర్తి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవయవ మార్పిడి సేవలు ప్రారంభిస్తాం



అంబాజీపేటలో మాట్లాడుతున్న కిమ్స్ ఎండీ రవివర్మ, వేదికపై ఎమ్మెల్యే ఆనందరావు, సత్యనారాయణ

అంబాజీపేట: వచ్చే ఏడాది జనవరి నుంచి అవయవ మార్పిడి వైద్య సేవలు అందిస్తున్నట్లు అమలాపురం, పి.గన్నవరం ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణలు పేర్కొన్నారు. అంబాజీపేటలో కిమ్స్ ఆస్పత్రి పర్యవేక్షణలో ఏర్పాటు చేసి మెడ్ యునైటెడ్ ఆధ్వర్యంలో యాక్సిడెంట్ అండ్ ఎమర్జెన్సీ ఆస్పత్రిని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కిమ్స్ ఎండీ కె.రవివర్మ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కిమ్స్ ఆస్పత్రిలో అవయవ మార్పిడి వైద్య సేవలతో పాటు అంకాలజీ, క్యాన్సర్ ఆస్పత్రిని రూ.50 కోట్లతో ప్రారంభిస్తున్నామన్నారు. ప్రస్తుతానికి అంబాజీపేట, మలికిపురం మండలాల్లో మెడ్‌యునైటెడ్ ఆధ్వర్యంలో ఆస్పత్రులు ప్రారంభించామన్నారు. ఈ ఆస్పత్రిలో మూడు స్థాయిల్లో వైద్య సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు, పీకే రావు, నామన రాంబాబు, గణపతి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితుడికి జైలు శిక్ష

ఆలమూరు: మద్యం తాగి వాహనాన్ని నడిపిన లారీ డ్రైవర్ దాకారపు రమేష్‌బాబు (465)కు 15 రోజుల జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం తీర్పును వెలువరించింది. స్థానిక ఎస్సై ఎం.అశోక్ కథనం ప్రకారం ఈనెల 8న జొన్నాడలో మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీనిపై కేసును నమోదు చేసిన స్థానిక పోలీసులు సోమవారం కోర్టులో హాజరుపర్చారు. ఈమేరకు ఇన్‌చార్జి జూనియర్ జడ్జి నాగేశ్వరరావు తుది తీర్పు వెలువరించారు.

రహదారుల అభివృద్ధికి శ్రీకారం

అయినవిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం శ్రీకారం చుట్టారు. మండలంలోని విలస, సిరిపల్లి, మాగం, పోతుకుర్రు, శంకరాయగూడెం, క్రాప, కె.జగన్నాథపురం, తొత్తరమూడి, శానపల్లిలంక, కొండుకుదురు, పొట్టిలంక, ఎస్.మూలపాలెం గ్రామాల్లో 34 రహదారులకు రూ.1.78 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ జేఈ ఆనంద్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా వర్షం



మామిడికుదురు జాతీయ రహదారిపై నిలిచిన వర్షం నీరు

మామిడికుదురు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం మామిడికుదురు మండల వ్యాప్తంగా భారీ వర్షం కురుస్తోంది. దీంతో నగరం, మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో జాతీయ రహదారిపై భారీగా వర్షం నీరు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాశర్లపూడిలంక, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, మొగలికుదురు, పెదపట్నం, ఆదుర్రు, ఈదరాడ, మగటపల్లి తదితర గ్రామాల్లో సైతం రోడ్లపై భారీగా వర్షపునీరు నిలిచిపోయింది. మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో రహదారులపైకి ముంపునీరు చేరింది. అయినవిల్లి, విలస, తొత్తరమూడి, ఎస్.మూలపాలెం తదితర గ్రామాల్లో పల్లపు కాలనీలు నీట మునిగాయి.